# అయోధ్య మందిరానికి కేంద్ర ప్రభుత్వ విరాళం రూపాయి



యన్.సంతోష్‌కుమారాచారి
కరెంట్ అఫైర్స్ నిపుణులు
హైదరాబాద్
ఫోన్ : 9848286270


## అంతర్జాతీయం

### అమెరికా అధ్యక్షుడిపై వీగిన అభిశంసన తీర్మానం



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై డెమొక్రాట్లు ప్రవేశ పెట్టిన అభిశంసన తీర్మానం రిపబ్లికన్ల ఆధిక్యంలోని సెనేట్‌లో వీగిపోయింది. అధికార దుర్వినియోగం, కాంగ్రెస్ అధికారాన్ని అడ్డుకున్నారన్న ఆరోపణలతో ట్రంప్‌పై 2019, డిసెంబర్‌లో డెమొక్రటిక్ పార్టీ అమెరికన్ కాంగ్రెస్‌లో అభిశంసనను ప్రవేశపెట్టింది. కాంగ్రెస్ ఆమోదం పొందిన అభిశంసన తీర్మానాన్ని తాజాగా సెనేట్‌లో ప్రవేశపెట్టారు. ఇందులో ట్రంప్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్న అభియోగం 52-48 ఓట్ల తేడాతో, కాంగ్రెస్ విధులకు ఆటంకం కలిగించారనే అభియోగం 53-47 ఓట్ల తేడాతో వీగిపోయాయి. అభిశంసనను తిప్పికొట్టేందుకు 100 మంది సభ్యుల సభలో మూడింట రెండొంతుల ఓట్లు అవసరం.

### ప్రతి పది మందిలో ఒకరికి కేన్సర్ : డబ్ల్యూహెచ్‌వో

World Health Organization

భారతదేశంలో 2018లో దాదాపు 11.6 లక్షల కేన్సర్ కేసులు కొత్తగా నమోదైనట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) వెల్లడించింది. ప్రతి పది మంది భారతీయుల్లో ఒకరు తమ జీవిత కాలంలో ప్రాణాంతక కేన్సర్ వ్యాధి బారినపడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. కేన్సర్ బారిన పడినవారిలో ప్రతి 15మందిలో ఒకరు మరణించే అవకాశం ఉందని తెలిపింది. వరల్డ్ కేన్సర్‌డే సందర్భంగా డబ్ల్యూహెచ్‌వో, ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసెర్చ్ ఆన్ కేన్సర్ (ఐఏఆర్‌సీ) సంస్థలు ఫిబ్రవరి 4న రెండు నివేదికలు విడుదల చేశాయి. కేన్సర్ వ్యాధిపై ప్రపంచవ్యాప్తంగా ఎజెండా రూపొందించడంతో పాటు కేన్సర్‌పై పరిశోధన, నివారణలపై ఈ నివేదికలు ప్రధాన దృష్టి సారించాయి. సరైన జాగ్రత్తలు తీసుకోని పక్షంలో రాబోయే 20 ఏళ్లలో మధ్య ఆదాయ దేశాల్లో కేన్సర్ మరణాల రేటు 60 శాతం పెరిగే అవకాశం ఉన్నట్లు డబ్ల్యూహెచ్‌వో హెచ్చరించింది.

### అంతర్జాతీయ మత స్వాతంత్ర్య కూటమి ఏర్పాటు

ప్రపంచ వ్యాప్తంగా వ్యక్తుల మత స్వేచ్ఛను పరిరక్షించేందుకు 27 దేశాలు కలిసి అంతర్జాతీయ మత స్వాతంత్ర్య కూటమి (ఇంటర్నేషనల్ రెలిజియస్ ఫ్రీడం అలయెన్స్)గా ఏర్పాటయ్యాయి. అమెరికాలోని వాషింగ్టన్‌లో ఫిబ్రవరి 5న ఈ కూటమి ప్రారంభమైంది. అమెరికా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, బ్రిటన్, ఇజ్రాయెల్, ఉక్రెయిన్, నెదర్లాండ్స్, గ్రీస్ తదితర దేశాలు ఈ కూటమిలో సభ్య దేశాలుగా చేరాయి. మత స్వాతంత్ర్యాన్ని గౌరవించి, పరిరక్షించేందుకు కట్టుబడి ఉంటామని కూటమిలోని సభ్య దేశాలు ప్రతినబూనాయి.

## జాతీయం

### కేంద్ర బడ్జెట్ 2020-21 హైలైట్స్




2020 -21 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కేంద్ర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న పార్లమెంటులో ప్రవేశ పెట్టారు. నరేంద్ర మోడీ సర్కారు రెండోసారి అధికారంలోకి వచ్చాక ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన రెండో బడ్జెట్ ఇది. లోక్‌సభలో రెండున్నర గంటలకుపైగా బడ్జెట్ ప్రసంగం చేసిన నిర్మలా సీతారామన్.. గ్రామీణ, వ్యవసాయరంగాలకు పెద్దపీట వేశారు. ఆదాయ పన్ను చెల్లింపులో పలు మార్పులు తీసుకొచ్చారు. మధ్య, ఎగువ తరగతి వర్గాలకు ఊరటనిచ్చేలా వ్యక్తిగత ఆదాయ పన్ను రేట్లలో మార్పులు చేశారు.

**బడ్జెట్‌లోని ముఖ్యాంశాలు..**

- ✧ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా అందరికీ ఇళ్లు మంజూరు చేస్తాం
- ✧ అదుపులో ద్రవ్యోల్బణం
- ✧ ఎకానమీని సంఘటితపరిచేందుకు చర్యలు
- ✧ ఆరోగ్యకరమైన వాణిజ్య వృద్ధికి తోడ్పాటు
- ✧ జీఎస్టీతో సామాన్యులకు నెలకు 4 శాతం వరకూ ఆదా
- ✧ 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేయడం బడ్జెట్ లక్ష్యం
- ✧ రైతు సంక్షేమానికి 16 కార్యాచరణ ప్రణాళికలు
- ✧ 100 కరువు జిల్లాలకు తాగునీరు అందించే పథకాలు
- ✧ 26 లక్షల మంది రైతులకు సోలార్ పంపు సెట్లు
- ✧ ఆన్‌లైన్‌లో ఆర్గానిక్ ఉత్పత్తులు
- ✧ రైతుల సౌకర్యార్థం రిఫ్రిజిలేటర్‌తో కూడిన కిసాన్ రైలు ఏర్పాటు
- ✧ సివిల్ ఏవియేషన్ ద్వారా కూరగాయల సరఫరాకు కృషి ఉడాన్ పథకం
- ✧ జీరో బడ్జెట్ నేచురల్ ఫామింగ్‌కు చేయూత
- ✧ గ్రామీణ మహిళలకు ధాన్యలక్ష్మి పేరుతో నూతన స్కీం
- ✧ నాబార్డు ద్వారా రీఫైనాన్స్ పునరుద్ధరణ
- ✧ యువ పారిశ్రామికవేత్తల ప్రోత్సాహానికి ప్రత్యేక పథకం
- ✧ గ్లోబలైజేషన్‌కు అనుగుణంగా పరిశ్రమల అభివృద్ధి
- ✧ ఇండస్ట్రియల్ ఇన్వెస్ట్‌మెంట్ సెల్ ఏర్పాటు
- ✧ పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్
- ✧ విద్యారంగంలోనూ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతి
- ✧ విద్య, స్కిల్ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి
- ✧ 2026నాటికి 150 వర్సిటీల్లో స్కిల్ డెవలప్‌మెంట్ కోసం కొత్త కోర్సులు
- ✧ ప్రస్తుతం ఉన్న ప్రతి జిల్లా ఆస్పత్రికి మెడికల్ కాలేజీ
- ✧ నేషనల్ పోలీస్, ఫోరెన్సిక్ యూనివర్సిటీ
- ✧ భారత్‌లో చదువుకోవాలనుకునే విదేశీ విద్యార్థుల కోసం ఇన్సాట్ పరీక్షలు
- ✧ ఆడపిల్లల వివాహ వయస్సు పెంపు విషయమై టాస్క్ ఫోర్స్ ఏర్పాటు
- ✧ కరెంటు బిల్లుల స్థానంలో త్వరలో స్మార్ట్ ప్రీ పెయిడ్ మీటర్లు
- ✧ ఆప్టికల్ ఫైబర్ లింక్‌తో లక్షగ్రామపంచాయతీల అనుసంధానం
- ✧ రైల్వేల్లో మరింత ప్రైవేటీకరణ.. పీపీపీ పద్ధతిలో 150 రైళ్లు
- ✧ వచ్చే నాలుగేళ్లలో 100 కొత్త ఎయిర్‌పోర్ట్‌లు
- ✧ నూతన వ్యక్తిగత ఆదాయపన్ను రేట్లు
- ✧ ఆదాయపన్ను శ్లాబ్‌లు నాలుగు నుంచి ఏడుకు పెంపు
- ✧ కార్పొరేట్ ట్యాక్స్ 15శాతం తగ్గింపు

**రంగాలవారీగా కేటాయింపులు...**

- ✧ జల్‌జీవన్ మిషన్‌కు రూ 11,500 కోట్లు
- ✧ విద్యారంగానికి రూ 99.300 కోట్లు
- ✧ నైపుణ్యాభివృద్ధికి రూ 3,000 కోట్లు
- ✧ కొత్తగా ఐదు స్మార్ట్ సిటీల అభివృద్ధి
- ✧ నేషనల్ టెక్నికల్ టెక్స్‌టైల్ మిషన్ ఏర్పాటుకు రూ. 1480 కోట్లు
- ✧ పరిశ్రమలు, వాణిజ్య రంగానికి రూ. 27,300 కోట్లు
- ✧ రవాణా మౌలిక సదుపాయాలకు రూ . 1.7 లక్షల కోట్లు
- ✧ సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి రూ. 9500 కోట్లు
- ✧ టూరిజం ప్రోత్సాహానికి రూ. 2500 కోట్లు
- ✧ సాంస్కృతిక శాఖకు రూ. 3150 కోట్లు
- ✧ మహిళా సంక్షేమ పథకాల రూ. 28,600 కోట్లు
- ✧ పౌష్టికాహార పథకానికి రూ. 35.6 కోట్లు

### అయోధ్య మందిరానికి కేంద్ర ప్రభుత్వ విరాళం రూపాయి

ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో రామ మందిర నిర్మాణం కోసం తొలి విరాళంగా కేంద్ర ప్రభుత్వం ఒక రూపాయిని లాంఛనంగా 'శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర' ట్రస్ట్‌కు అందజేసింది. ప్రభుత్వం తరపున హోంశాఖలో అండర్ సెక్రటరీగా పనిచేస్తున్న డీ ముర్ము ఫిబ్రవరి 6న ఈ మొత్తాన్ని నగదు రూపంలో ట్రస్ట్‌కు అందించారు. నగదు రూపంలో కానీ, స్థిరచరాస్తుల రూపంలో కానీ ట్రస్ట్‌కు విరాళాలు అందజేయవచ్చని ప్రభుత్వ అధికారులు తెలిపారు. ట్రస్ట్ కార్యాలయాన్ని తాత్కాలికంగా గ్రేటర్ కైలాశ్ ప్రాంతంలోని సీనియర్ న్యాయవాది, ట్రస్ట్ సభ్యుడు పరాశరన్ ఇంట్లో ఏర్పాటు చేశామని, త్వరలో శాశ్వత కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. అయోధ్యలో రామాలయ నిర్మాణం కోసం 15 మంది సభ్యులతో కేంద్రం శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర పేరుతో ఒక ట్రస్ట్‌ను ఏర్పాటు చేసింది.

### యథాతథంగా కీలక పాలసీ వడ్డీ రేట్లు

కీలక పాలసీ వడ్డీ రేట్లు అయిన రెపో రేటు, రివర్స్ రెపో రేటును రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) యథాతథంగా కొనసాగించింది. ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 6న సమావేశమైన ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. అయితే 11 ఏళ్ల కనిష్టానికి చేరిన ఆర్థిక వృద్ధికి మద్దతుగా బ్యాంకింగ్, రియల్టీ, ఎంఎస్‌ఎంఈ, ఆటో రంగాలకు ప్రోత్సాహక చర్యలతో ఆర్‌బీఐ ముందుకు వచ్చింది. రుణ రేట్లను తగ్గించేందుకు వీలుగా బ్యాంకులకు రూ.లక్ష కోట్లను సమకూర్చనున్నట్టు శక్తికాంతదాస్ ప్రకటించారు.

### వృద్ధి రేటు 5 శాతం




2019-20లో దేశ వృద్ధి రేటు 5 శాతంగా ఉంటుందని ఆర్‌బీఐ తెలిపింది. 2020-21లో 6 శాతంగా ఉంటుందని అంచనా వేసింది. 2020-21 తొలి ఆరు నెలల్లో 5.9-6.3 శాతం మధ్య ఉంటుందన్న లోగడ అంచనాలను.. 5.5-6 శాతానికి తగ్గించింది.

### ఆదాయ పన్ను ఈ-కాలిక్యులేటర్ ఆవిష్కరణ

కొత్త, పాత విధానాల్లో ఎంత మేర ఆదాయ పన్ను చెల్లించాల్సి ఉంటుందో తెలుసుకోవడానికి వీలు కల్పిస్తూ ఆదాయ పన్ను శాఖ ఫిబ్రవరి 6న ప్రత్యేకంగా ఈ-కాలిక్యులేటర్‌ను ఆవిష్కరించింది. ఇందులో పాత, కొత్త విధానాలను పోల్చి చూసుకుని, ఏది ప్రయోజనకరంగా ఉంటుందో ఒక అంచనాకు రావచ్చు. తమ ఆదాయాలు, మినహాయింపులు, డిడక్షన్స్ మొదలైన వివరాలన్నీ ఇందులో పొందుపరిస్తే.. పాత, కొత్త విధానాల్లో పన్ను భారాలను తెలుసుకోవచ్చు. ప్రస్తుత విధానంలో ఆదాయాన్ని బట్టి 5, 10, 30 శాతాల్లో పన్నులు ఉంటున్నాయి. ఐటీ రిటర్నులను దాఖలు చేసేందుకు ఉద్దేశించిన www.incometaxindiaefiling.gov.in లో ఈ కాలిక్యులేటర్ అందుబాటులో ఉంటుంది.

### ఏపీకి రూ.21,000 కోట్ల ఏఐఐబీ రుణం

AIIB ASIAN INFRASTRUCTURE INVESTMENT BANK

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కొత్తగా 3 బిలియన్ డాలర్ల (రూ. 21 వేల కోట్లకు పైగా) రుణం అందించేందుకు ఏషియన్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఏఐఐబీ) సంసిద్ధత వ్యక్తం చేసింది. గతంలో ఇచ్చిన రుణానికి ఇది అదనమని బ్యాంకు ప్రతినిధులు వెల్లడించారు. ప్రభుత్వం నిర్దేశించుకున్న ప్రాధాన్యతల ప్రకారం ఈ డబ్బును ఖర్చు చేసుకోవచ్చని స్పష్టం చేశారు.

### చైనా ప్రయాణికులకు భారత్ ఇ-వీసా రద్దు

చైనా నుంచి వచ్చే ప్రయాణికులు, ఆ దేశంలోని ఇతర దేశస్తులకు ఇ-వీసా సౌకర్యాన్ని భారత్ తాత్కాలికంగా రద్దు చేసింది. ప్రత్యేక ఆరోగ్య పరిస్థితుల్ని (కరోనా వైరస్ వ్యాప్తి) దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్టు బీజింగ్‌లో భారత రాయబార కార్యాలయం ఫిబ్రవరి 2న ప్రకటించింది. ఇక అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి దేశాలు చైనా మీదుగా ప్రయాణించే వారిని కూడా తమ దేశంలోకి రానివ్వకూడదని నిర్ణయం తీసుకున్నారు.

### డబ్ల్యూహెచ్‌ఈఎఫ్ సదస్సు

WORLD HINDU ECONOMIC FORUM

వరల్డ్ హిందూ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూహెచ్‌ఈఎఫ్) ప్రాంతీయ సదస్సుకు విజయవాడ వేదిక కానుంది. ఫిబ్రవరి 8, 9 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు పది దేశాలకుపైగా 300మంది ప్రతినిధులు హాజరు కానున్నారని డబ్ల్యూహెచ్‌ఈఎఫ్-2020 సదస్సు ఛైర్మన్ ఎస్.ఎన్. కుమార్ బుద్ధవరపు ఫిబ్రవరి 5న తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించి ఈ సదస్సును ఇక్కడ ఏర్పాటు చేస్తున్నామని, 'కలసి అభివృద్ధి చెందుదాం- కలసి పంచుకుందాం' అన్న లక్ష్యంతో దీన్ని నిర్వహిస్తున్నారు.

### మహారాష్ట్రలో రూ.65వేల కోట్లతో పోర్టు నిర్మాణం

మహారాష్ట్రలో రూ.65వేల కోట్లతో భారీ పోర్టు నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన ఫిబ్రవరి 5న సమావేశమైన మంత్రివర్గం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ముంబైలోని జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ ట్రస్ట్ (జేఎన్‌పీటీ)కి 97 కిలోమీటర్ల దూరంలోని వధావన్ వద్ద ఈ భారీ పోర్టు నిర్మాణం చేపడతారు. ప్రైవేటు భాగస్వామ్యంతో (ల్యాండ్ లార్డ్ మోడల్‌లో) అభివృద్ధి చేసే ఈ ప్రాజెక్టుకు రూ. 65,544.54 కోట్లు వ్యయం అవుతుందని అంచనా.

### మంత్రిమండలి నిర్ణయాలు

ఎయిర్ ఇండియా అనుబంధ సంస్థ అలయన్స్ ఎయిర్ ద్వారా భారత్-శ్రీలంకల మధ్య విమాన సర్వీసులు నడపడానికి ఆమోదం. కేంద్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. సూరత్, భోపాల్, భాగల్పూర్, అగర్తల, రాయచూర్ ట్రిపుల్ ఐటీ (పీపీపీ)లకు జాతీయ ప్రాధాన్య సంస్థల హోదా కల్పించాలని నిర్ణయం. పీఎంసీ బ్యాంక్ తరహా సంక్షోభం మరోసారి తలెత్తకుండా డిపాజిట్‌దారుల ప్రయోజనాల పరిరక్షణ, సహకార బ్యాంకులను మరింత పటిష్టం చేసే దిశగా బ్యాంకింగ్ నియంత్రణ చట్టానికి సవరణకు ఆమోదం.

### త్వరలో ఎయిర్ డిఫెన్స్ కమాండ్ ఏర్పాటు

భారత గగనతలంలో జరిగే వైమానిక దళ ఆపరేషన్లు అన్నింటినీ పర్యవేక్షించేలా 'ఎయిర్ డిఫెన్స్ కమాండ్'ను త్వరలో ఏర్పాటు చేస్తామని భారత తొలి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ బిపిన్ రావత్ ఫిబ్రవరి 4న వెల్లడించారు. హిందూ మహాసముద్రం పరిసర ప్రాంతాల్లో జరిగే నేవీ ఆపరేషన్ల కోసం ద్వీపకల్ప కమాండ్‌ను, సైనికులకు వసతి, ఆయుధాలు సమకూర్చడం వంటి అవసరాలు తీరుస్తూనే, వారి సేవల్ని వినియోగించుకునేలా లాజిస్టిక్ కమాండ్‌ను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్టు తెలిపారు.

### అమల్లోకి రూ.5 లక్షల డిపాజిట్ బీమా : ఆర్‌బీఐ

बारतीय रिज़र्व बैंक RESERVE BANK OF INDIA

బ్యాంకు డిపాజిట్లకు పెంచిన బీమా కవరేజీ ఫిబ్రవరి 4 నుంచే అమల్లోకి తెచ్చినట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వెల్లడించింది. డిపాజిటర్ల ప్రయోజనాల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. బ్యాంకు డిపాజిట్లపై బీమా కవరేజీని ప్రస్తుతమున్న రూ. 1 లక్ష నుంచి రూ. 5 లక్షలకు పెంచుతున్నట్లు 2020-21 బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆర్‌బీఐలో భాగమైన డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ (డీఐసీజీసీ) ఈ కవరేజీ ఇస్తుంది.